# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక








సంపుటి :12 సంచిక :297 శనివారం 27-6-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


# శిధిలాల్లోనే

## వెనిజులా భూకంపంలో 589 కి పెరిగిన మృతులు

వెనెజువెల వ్యాప్తంగా తీవ్ర విధ్వంసం

- శిథిలాల్లోనే ప్రాణాల కోసం ఉత్కంఠభరిత గాలింపు
- 17 దేశాల రెస్క్యూ బృందాలతో ముమ్మర సహాయక చర్యలు
- మృతులు 589.. గాయపడిన వారు 2,980కు చేరిక
- భారత్ నుంచి వైద్య బృందం, ఫీల్డ్ హాస్పిటల్ సామగ్రి తరలింపు
- ఆహారం, నీరు అందిస్తూ బాధితులకు ఊరటనిస్తున్న సహాయక బృందాలు

కార్కస్

వెనిజులాను మరుభూమిగా మార్చిన భూ ప్రకంపనల నుంచి ఇప్పటికీ తేరుకోలేదు. రెండోరోజైన శుక్రవారం శిథిలాల్లో ఉన్న జనాన్ని కాపాడేపనిలో సహాయక బృందాలు నిమగ్నమయ్యాయి. రెండు శక్తివంతమైన భూకంపాల కారణంగా మరణించిన వారి సంఖ్య 589కి పెరిగిందని, 2,980 మంది గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగెజ్ తెలిపారు. 'ఆపరేషన్ అమిస్టాడ్'లో భాగంగా మానవతా సహాయక చర్యలకు మద్దతుగా, భారత సైన్యానికి చెందిన '60 పారా ఫీల్డ్ హాస్పిటల్' నుండి తొమ్మిది మంది వైద్య అధికారులతో కూడిన 41 మంది



-మిగతా 2లో



## కేంద్ర క్యాబినెట్ భారీ ప్రక్షాళన!

- ఈ వారంలో పునర్వ్యవస్థీకరణ
- ప్రధాన్, హర్దీప్‌నకు ఉద్వాసన.. సీతారామన్ శాఖ మార్పు!
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఉంచేది లేనిదీ అనుమానమే
- తెలంగాణ నుంచి బెర్త్ కోసం నలుగురు ఎంపీల పోటీ
- ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు మంత్రి వర్గంలో చోటు!
- బీజేపీ సంస్థాగత నిర్మాణంలోనూ విస్తృత మార్పులు

న్యూఢిల్లీ,

కేంద్ర మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి! నరేంద్ర మోదీ మంత్రివర్గంలో భారీ మార్పులు జరిగే అవకాశం ఉందని బీజేపీ వర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతున్నది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకున్నారు. ఆదివారం కాని, సోమవారం కాని మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ చేయనున్నట్టు ఆమెకు అమిత్ షా వివరించినట్టు సమాచారం. ఈసారి మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణలో ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు కేంద్ర మంత్రివర్గంలో చోటు ఖాయమన్న మాట వినిపిస్తున్నది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను మానవ వనరుల

-మిగతా 2లో




## తెలంగాణలో 13 మంది ఐఏఎస్ బదిలీ

- సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్. శ్రీధర్
- ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా అజిత్ రెడ్డి
- అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి---శైలజా రామయ్యర్
- విపత్తు నిర్వహణ---రాహుల్ బొజ్జా
- పొలిటిక్ జేఏడీ---అహ్మద్ నదీమ్
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్---వెంకన్న

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా

-మిగతా 2లో

## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ

# భాగస్వాములే

### డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఈ మహమ్మారిని తరిమికొట్టేందుకు కలిసికట్టుగా ముందుకు రావాలి
- ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు
- అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సందేశం
- డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యం
- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచన
- కుటుంబాలు, సమాజం కలిసి అవగాహన పెంచాలని విజ్ఞప్తి
- చట్టపరమైన చర్యలతో పాటు ప్రజల సహకారం అవసరం: సీఎం

సమాజాన్ని డ్రగ్స్ నాశనం చేస్తాయి. డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటు మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు.



2లో



## తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి
- జూన్ 30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం
- పరిపాలనా సంస్కరణలు, అభివృద్ధిపై దృష్టి పెట్టనున్న కొత్త సీఎస్

హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం

-మిగతా 2లో


## ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు

- వాతావరణశాఖ భారీ రెయిన్ అలర్ట్ జారీ
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ

హైదరాబాద్,

నైరుతి రుతుపవనాలు ఏపీలో విస్తరిస్తున్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ వానలు పడగా.. అమరావతి వాతావరణ కేంద్రం భారీ వర్షసూచన జారీ చేసింది. జూన్ 26వ తేదీన అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పోలవరం, పశ్చిమగోదావరి, విజయనగరం,

-మిగతా 2లో



## ఆపరేషన్ సిందూర్‌లో అమర వీరులు వీరే..

తొలిసారి పేర్లను వెల్లడించిన ప్రభుత్వం



2లో

## డ్రగ్స్ రహిత తెలంగాణే

# ప్రభుత్వ లక్ష్యం



### డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలి

- డ్రగ్స్‌పై పోరాటంలో ఈగల్ ఫోర్స్ కృషి అసామాన్యం
- అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలం
- ఈగల్ ఫోర్స్ డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భట్టి

హైదరాబాద్,

విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్‌కు ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. తమ పిల్లలు

-మిగతా 2లో

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి
- అందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి
- క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలి
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన

అమరావతి,

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల్ని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి భద్రత, దోమల నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్

-మిగతా 2లో



# శిథిలాల్లోనే

మొదటి తరువాయి

సభ్యుల బృందం వెనిజులాకు చేరుకున్నది. వినాశకరమైన జంట భూకంపాల తర్వాత ప్రాణాలతో బయటపడిన వారి కోసం గాలించేందుకు కనీసం 17 దేశాల నుంచి అంతర్జాతీయ గాలింపు , సహాయక బృందాలను వెనిజులాకు పంపుతున్నట్టు ఐక్యరాజ్యసమితి శుక్రవారం తెలిపింది. శిథిలాల్లో చిక్కుకున్న వారి గాలింపుకోసం సహాయక బృందాలను ఘటనా స్థలానికి చేర్చడమే "అత్యంత ప్రాధాన్యత" అని ఐక్యరాజ్యసమితి మానవతా వ్యవహారాల విభాగం ( ఓసీహెచ్ ఏ) పేర్కొంది. మృతుల సంఖ్య పెరుగుతుండగా, తమ వారి కోసం వెనిజులా శిథిలాల మధ్య చిక్కుకున్న తమ బంధువులను స్థానికులు గాలిస్తున్నారు. ఒకరికొకరు సహాయం చేసుకున్నారు. "చిక్కుకుపోయిన ప్రజలను మేం రక్షించబోతున్నాం" అని డెల్సీ రోడ్రిగెజ్ అన్నారు. "మేము ఈ పని మీద అవిశ్రాంతంగా పనిచేస్తున్నాం." బుధవారం సాయంత్రం సంభవించిన 7.2, 7.5 తీవ్రత గల భూకంపాల వల్ల లా గువైరా రాష్ట్రం తీవ్రంగా దెబ్బతిందని, సహాయక బృందాలు ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలిస్తూ, ఆహారం , నీటిని పంపిణీ చేస్తున్నందున ఆ ప్రాంతాన్ని సైనికీకరించారని ఆమె పేర్కొన్నారు. వేలాది మంది గల్లంతైనట్లు నివేదికలు రావడం మరియు ముమ్మర సహాయక చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

## తెలంగాణలో 13 మంది
# ఐఏఎస్ బదిలీ

మొదటి తరువాయి

అహ్మద్ నదీమ్ నియమితులు అయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ / ఎక్స్-ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు

మొదటి తరువాయి

పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక మిగతా జిల్లాల్లో కూడా పిడుగులతో కూడిన వానలు కురిసే అవకాశముందని, పొలాల్లో ఉండే కూలీలు, రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షాలు పడే సమయంలో సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని పేర్కొంది. ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. గడిచిన 24 గంటల్లో పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లిలో 5.2 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదవ్వగా.. కృష్ణా జిల్లా గుడివాడలో 3.5 సె.మీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురంలో 3.5 సె.మీ, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో 3.3 సె.మీ, ఏలూరు జిల్లా భీమడోలులో 3 సె.మీల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఇక ఏలూరు జిల్లా కైకలూరులో 2.9 సెంటీమీటర్లు, విజయనగరంలో 2.7 సె.మీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా అమలాపురంలో 2.6 సె.మీ, ఎన్టీఆర్ జిల్లా పాలేరు బ్రిడ్జి 2.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక రాయలసీమలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఈదురుగాలులు 40-50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయిని తెలిపింది. ఇక కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవనుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగనుంది. ఏపీపై కూడా ఎల్‌నినో ప్రభావం ఉంటుందని, పంటల సాగు విషయంలో ప్రత్యామ్నాయలను ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అటు తెలంగాణలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. జూన్ 26,278వ తేదీల్లో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఇక జూన్ 27,28వ తేదీల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వానలు కురుస్తాయని తటిపింది. ఇక జూన్ 28,29వ తేదీల విషయానికొస్తే.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది.

## ఆపరేషన్ సిందూర్‌లో అమర వీరులు వీరే..

తొలిసారి పేర్లను వెల్లడించిన ప్రభుత్వం



న్యూఢిల్లీ,
పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం నిరుడు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన ఆరుగురు సైనికుల వివరాలను కేంద్రం తొలిసారిగా శుక్రవారం వెల్లడించింది. ఇందులో ఐదుగురు భారత సైన్యం, ఒకరు వైమానిక దళానికి చెందిన వారు. వీరి పేర్లను జాతీయ యుద్ధ స్మారక వెబ్‌సైట్‌లో గౌరవ పట్టికలో ప్రచురించారు. న్యూఢిల్లీలోని యుద్ధ స్మారక చిహ్నం 3డీ గోడపై కూడా పొందుపరిచారు. ఆర్మీకి చెందిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్, రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్, లాన్స్ నాయక్ దినేశ్ కుమార్, వైమానిక సాంకేతిక నిపుణుడు మూడ్ మురళీనాయక్, హవల్దార్ సునీల్ కుమార్ సింగ్, వైమానిక దళానికి చెందిన సార్జంట్ సురేంద్ర కుమార్ ఉన్నారు.

# కేంద్ర క్యాబినెట్ భారీ ప్రక్షాళన!

మొదటి తరువాయి

శాఖకి మారుస్తారని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురిలను ఇంటికి పంపొచ్చని తెలిసింది. ఇటీవలే కొత్తగా ఆరుగురు ఎంపీలను ఠాక్రే వర్గం నుంచి తెచ్చిన శివసేన(షిండే)కు బహుమతిగా ఎంపీ శ్రీకాంత్ షిండేకు మంత్రి పదవిని ఇచ్చే అవకాశం ఉంది. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు ఈసారి మంత్రి పదవిని కట్టబెడతారు. మరోవైపు మీరట్ ఎంపీ అరుణ్ గోవిల్ (రామాయణం సీరియల్‌లో రాముని పాత్రధారి)ను మంత్రివర్గంలో చేర్చుకుంటారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి, యూపీ నేత పంకజ్ చౌదరిని మంత్రివర్గం నుంచి తప్పించవచ్చు. ఆప్ నుంచి వచ్చిన నేతల్లో రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్ (లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ)లో ఒకరికి స్థానం కల్పించవచ్చు.

**30 మంది మంత్రులపై ప్రభావం**

ఈసారి దాదాపు 25 నుంచి 30 మంది వరకు మంత్రులపై ప్రభావం చూపేలా పునర్వ్యవస్థీకరణ ఉండే అవకాశం ఉందని కమలం పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇందులో 8 నుంచి 10 మంది మంత్రులకు ఉద్వాసన, 5 నుంచి ఏడుగురు సహాయ మంత్రులకు కేబినెట్ హోదా లేదా కీలక శాఖలతో



పదోన్నతి, 10 నుంచి 15 మంతి కొత్తవారికి అవకాశం, మరో 10 నుంచి 15 మంది మంత్రుల శాఖల్లో మార్పులు జరిగే అవకాశం ఉంది. తెలంగాణకు చెందిన బండి సంజయ్‌ను మంత్రి పదవిలో కొనసాగిస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకమే. ఇటీవలే ఆయన కుమారుడు పోక్సో కేసులో అరెస్టయ్యి జైలులో ఉన్నారు. దీంతో బండిని పదవి నుంచి తప్పించాలని ఆయన వైరి వర్గం డిమాండ్ చేస్తున్నది. తెలంగాణ నుంచి ఒక్క మంత్రి పదవి కోసం ఈటల రాజేందర్, లక్ష్మణ్, అరవింద్, డీకే అరుణ ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, రాజ్యాంగం ప్రకారం కేంద్ర మంత్రివర్గ గరిష్ఠ సంఖ్య 81 కావడంతో కొత్తగా పలువురికి అవకాశం కల్పించవచ్చు.

**యూపీ సూత్రం కేంద్ర స్థాయిలో అమలు!**

కేంద్ర మంత్రివర్గ విస్తరణతో పాటు బీజేపీ సంస్థాగత పదవుల్లోనూ విస్తృతంగా మార్పులు జరిగే అవకాశం ఉంది. కొద్ది రోజుల క్రితం యూపీలో ప్రకటించిన బీజేపీ కార్యవర్గంలో విస్తృతమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్య ంగా యువత, ఓబీసీలకు విస్తరణలో అధిక ప్రాధాన్యత ఇచ్చారు. సమాజ్‌వాది పార్టీ పీడీఏ (వెనుకబడిన వర్గాలు, దళితులు, అల్ప సంఖ్యాక వర్గాలు) నినాదాన్ని దీటుగా ఎదుర్కోవడం కోసమే యూపీ బీజేపీలో విస్తృత మార్పులు చోటుచేసుకున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ జాతీయ వ్యవస్థాపక బృందం కూడా ఇదే సూత్రాన్ని అనుసరించడానికి నిర్ణయించుకుందని, దీనిలో భాగంగా యువత, మహిళలు, ఇతర సామాజిక వర్గాలకు అధికంగా ప్రాతినిధ్యం కల్పించడానికి పార్టీ నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇటీవల మైనారిటీ వ్యవహారాల సహాయ మంత్రి జార్జి కురియన్ పదవీ కాలం ముగిసినప్పటికీ, అతడిని రాజ్యసభకు రీ నామినేట్ చేయలేదు. ఇదే తరహాలో త్వరలోనే పలువురు నేతలను సాగనంపుతారని పార్టీలో ప్రచారం జరుగుతున్నది.

# డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే

హైదరాబాద్

సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల



చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

మొదటి తరువాయి

అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు. సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార-ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర



పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాకుండా, కేంద్ర నిధుల సాధనలోను, కేంద్ర-రాష్ట్రాల మధ్య పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ మరియు పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

## డ్రగ్స్ రహిత తెలంగాణే పభుత్వ లక్ష్యం

మొదటి తరువాయి

ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకునే తల్లిదండ్రుల ఆశ, రాష్ట్ర ప్రభుత్వ కల ఒక్కటేనని.. అది యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండటమేనని ఉద్ఘాటించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారు. ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు. ఈగల్ ఫోర్స్ సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించాం. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటాం. తెలంగాణలో పుట్టిపెరగడం ఓ భరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నాం. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యం. సినీ నటులు ఇచ్చే సందేశం సమాజంలోకి బలంగా వెళ్తుందని భట్టి విక్రమార్క అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రాణాలకు తెగించి, నిరంతరం రిస్క్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే అలాంటి ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని నమ్ముతూ, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక అవేర్‌నెస్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ బలోపేతం, రాష్ట్ర రక్షణ విషయాలలో ప్రభుత్వం ఎంతో కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. డ్రగ్స్ రవాణా లేదా వినియోగంలో ఎంతటి పెద్దవారు, ఎంతటి ప్రభావశీలురు ఉన్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని భట్టి విక్రమార్క తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చలనచిత్ర రంగానికి చెందిన హీరోలు, హీరోయిన్లు, ఇతర కళాకారులు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని శిల్పకళా వేదిక నుంచి ఆయన విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమలో ఉన్నవారు కూడా సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం తరపున కఠినమైన చట్టాలు చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మార్పు రానంతవరకు ఆశించిన ఫలితాలు రావని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. దేశంలో వరకట్న నిషేధ చట్టం ఉన్నప్పటికీ, అది ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడానికి సామాజిక మార్పు లోపించడమే కారణమని ఉదాహరించారు. డ్రగ్స్ నిర్మూలన వంటి కఠినమైన చట్టాలు వంద శాతం విజయవంతం కావాలంటే, చట్టాలతో పాటు సమాజంలో, ప్రజల ఆలోచనా విధానంలో స్పష్టమైన పరివర్తన రావాలని ఆయన ఆకాంక్షించారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మొదటి తరువాయి


బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయగలుగుతామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయపద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. "ఫ్రైడే -- డ్రైడే" కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్?మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే తాగునీటి నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. జారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి, అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలి. ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయాలి. శుభ్రత పాటించాలని సూచించారు.

## రైలు ప్రయాణికులకు అలర్ట్..



**హైదరాబాద్ జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** భారతీయ రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం లగేజీ రవాణా నిబంధనలలో కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా క్రీడాకారులు తమ పెద్ద క్రీడా పరికరాలను (జావెలిన్‌లు వంటివి) నిర్దేశిత ఛార్జీలు చెల్లించి, లగేజీ కంపార్ట్‌మెంట్‌లో సులభంగా తరలించుకోవచ్చు. వీటికి సాధారణ బరువు పరిమితి వర్తించదు. అయితే పోల్-వాల్ట్ పోల్స్‌పై నిషేధం కొనసాగుతుంది. ప్రమాదకరమైన, మండే స్వభావం గల వస్తువులను తీసుకెళ్లడంపై కఠిన ఆంక్షలు, ఉల్లంఘిస్తే జరిమానా, చట్టపరమైన చర్యలు ఉంటాయని రైల్వే శాఖ స్పష్టం చేసింది.


## అమెరికాకు రష్యా వార్నింగ్



**న్యూఢిల్లీ, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** ఇటీవల ఉక్రెయిన్ రష్యాపై డ్రోన్ల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. వందల డ్రోన్లలను ఏకధాటిగా రష్యాపైకి ప్రయోగిస్తోంది. తాజాగా ఈ అనుహ్య దాడులపై రష్యా విదేశాంగ మంత్రి మరియా జఖరోవా కీలక హెచ్చరిక చేశారు. ఉక్రెయిన్ దేశానికి అమెరికా అండగా ఉండి, ఆయుధాలు సరఫరా చేస్తోందని ఆరోపించారు. అమెరికా పదే పదే ఆయుధా సరఫరాతో ప్రపంచ స్థిరత్వానికి "ఊహించని పరిణామాలకు" దారితీయవచ్చని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా హెచ్చరించారు, ఉక్రెయిన్‌కు ఆయుధాల బదిలీపై మాస్కో తన ఆందోళనలను వాషింగ్టన్‌కు పదేపదే తెలియజేసిందన్నారు. "వాషింగ్టన్‌తో తమ చర్చల సందర్భంగా కీవ్ ప్రభుత్వానికి సైనిక పరికరాలను సరఫరా చేయడం ప్రాంతీయంగా, ప్రపంచవ్యాప్తంగా స్థిరత్వానికి ఊహించని పరిణామాలకు దారితీయవచ్చని తాము పదేపదే నొక్కిచెప్పాము" అని జఖరోవా తెలియజేశారు. ఉక్రెయిన్‌కు పాశ్చాత్య ఆయుధాలను రవాణా చేసే కాన్వాయ్‌లను రష్యా సైన్యం "చట్టబద్ధమైన లక్ష్యాలుగా" పరిగణిస్తుందనే రష్యా వైఖరిని ఆమె పునరుద్ఘాటించారు. జూన్ 19న జెలెన్స్కీ చేసిన వ్యాఖ్యలను కూడా జఖరోవా విమర్శించారు. ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలో బెలారస్‌లో ఉన్న రీట్రాన్స్‌మిషన్ స్టేషన్లను వారం రోజుల్లోగా తొలగించకపోతే, వాటిపై దాడులకు ఆదేశించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని జెలెన్స్కీ పేర్కొన్నారు. ఈ ప్రకటనలు అతని ఉగ్రవాద స్వభావాన్ని పూర్తిగా ఎత్తి చూపుతున్నాయి." "ఉగ్రవాదులు చెప్పేది అదే," అని జఖరోవా విమర్శించారు.


## డ్రమ్ములో నాలుగేళ్ల చిన్నారి మృతదేహం

**పులివెందులలో దారుణ ఘటన**



**పులివెందుల, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** పులివెందులకు సమీపంలోని గ్రామంలో జరిగిన దారుణ ఘటన సంచలనంగా మారుతోంది. గురువారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయిన నాలుగేళ్ల చిన్నారి చివరికి ఇంటి పరిసరాల్లో ఉండే డ్రమ్ములో మృతదేహమై కనిపించింది. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎక్కడికైనా వెళ్లి ఆడుకుంటుందేమో అన్న ఆలోచనలో ఉన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఈ చిన్నారి అలా చూసి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఇదంతా పొరుగింటి వారు చేసిన పనిగా అనుమానిస్తున్నారు. నాలుగేళ్ల చిన్నారి డ్రమ్‌లోకి వెళ్లేంత హైట్ కాదని చంపేసి అందులో పడేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లింగాల మండలంం లోపట్నూతల గ్రామంలో ఆ దారుణం జరిగింది. చిన్నారి పేరు నిత్విక. నాగవేటి రామాచారి, సృజన దంపతుల కుమార్తె. ఇంటి ఆవరణంలో ఆడుకుంటూనే గురవారం సాయంత్రం కనిపించుండా పోయింది. చిన్నారి కోసం చాలా ప్రాంతాల్లో గాలించారు. చివరకు ఆ చిన్నారి నీళ్ల ట్యాంకులో పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డ్రమ్ నాలుగు అడుగులు ఉంటుందని చిన్నారి అందులో ఎలా పడి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇది గిట్టని వారు చేసిన పనిగానే చెబుతున్నారు.

## ఐబీ చీఫ్‌గా మహేశ్ దీక్షిత్ నియామకం



**న్యూఢిల్లీ : జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** దేశ అంతర్గత గూఢచార వ్యవస్థలో అత్యంత కీలకమైన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) కొత్త డైరెక్టర్‌గా మహేశ్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ ఆయన నియామకానికి గురువారం ఆమోదముద్ర వేసింది. 1993 బ్యాచ్ తెలంగాణ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి దీక్షిత్ ప్రస్తుతం ఐబీ స్పెషల్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో భద్రతా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఈ సీనియర్ ఐపీఎస్ అధికారి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తన కెరీర్‌లో ఎక్కువకాలం ఐబీలోనే ఆయన సేవలందించారు

# ఢిల్లీలో విషవాయువులు పీల్చి ముగ్గురు కార్మికులు మృతి..

**పారిశ్రామిక ఏరియాలో ఘటన**

**న్యూఢిల్లీ, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** దేశ రాజధాని ఢిల్లీ పరిధిలో విషాదం జరిగింది. ఒక పరిశ్రమలో విష వాయువులు పీల్చి ముగ్గురు కార్మికులు మరణించారు. ఈ ఘటన ఢిల్లీలోని ముండ్కా పారిశ్రామిక ప్రాంతంలోని, ఫ్యాక్టరీ నెంబర్ 93/8లో శుక్రవారం జరిగింది. పోలీసులు, అధికారులు తెలిపిన ప్రాథమిక సమాచారం ప్రకారం పరిశ్రమలోని ఒక సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు ఒక కార్మికుడు లోపలికి దిగాడు. అక్కడ విష వాయువు పీల్చడం వల్ల కొద్దిసేపటికే అతడు స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో అతడిని కాపాడేందుకు మరో ఇద్దరు కార్మికులు కూడా ఒకరి తర్వాత మరొకరు లోపలికి దిగారు. కానీ, వాళ్లు కూడా అదే విషవాయువు పీల్చి స్పృహ తప్పి ట్యాంక్‌లోపలే



పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన ఇతర కార్మికులు ఫైర్, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది లోపలికి దిగి ముగ్గురిని బయటకు తీశారు. అనంతరం వారిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. ఆలోపే ముగ్గురు మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతులను అరుణ్ (38), సందీప్ (32), చంద్ (42)గా గుర్తించారు. ముగ్గురూ ఔటర్ ఢిల్లీలోని సుల్తాన్‌పురి పరిధి, ఇంద్ర జీల్ ఏరియాకు చెందిన వారుగా గుర్తించారు. ముగ్గురి మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై ముండ్కా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటనకు గల కచ్చితమైన కారణాలపై ఆరా తీస్తున్నారు. అలాగే, ప్రమాద స్థలంలో సరైన భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే విషయాలపై కూడా అధికారులు తనిఖీ నిర్వహించనున్నారు. అయితే, పారిశ్రామిక ప్రాంతాల్లోని సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. వీటి నుంచి హైడ్రోజన్ సల్ఫైడ్, మీథేన్, కార్బన్ డయాక్సైడ్ వంటి విష వాయువులు విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే,వ వీటి నుంచి బయటపడే భద్రతా మార్గాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. సరైన ప్రమాణాలు పాటిస్తే ఈ విష వాయువుల నుంచి రక్షించుకోవచ్చని చెబుతున్నారు.

# ఎల్‌నినోతో తక్కువ వర్షపాతం

**కేంద్రం తాజా అంచనాలు**

**న్యూఢిల్లీ, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర,



మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది. చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?÷-లకెమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# మతం మారినంత మాత్రాన రిజర్వేషన్లు వర్తించవు

**-ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనవి**
**-సంచలన తీర్పు వెల్లడించిన మద్రాస్ హైకోరు**

**మద్రాస్,జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** మతం మార్పిడులు, రిజర్వేషన్ల ప్రయోజనాలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఇతర వెనుకబడిన వర్గాల నుండి ఇస్లాం మతంలోకి మారిన వారికి "వెనుకబడిన తరగతి ముస్లిం" కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును హైకోర్టు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ పూర్తిగా కొట్టివేసింది. 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం... వెనుకబడిన తరగతి ), అత్యంత వెనుకబడిన తరగతి , డినోటిఫైడ్ కమ్యూనిటీస్ ), షెడ్యూల్డ్ కులాల (రాజ)కు చెందిన వ్యక్తులు ఇస్లాం మతంలోకి మారినప్పటికీ, వారు 'బీసీ ముస్లిం' కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం కొనసాగించవచ్చని పేర్కొంది. అంతేకాకుండా,



ప్రభుత్వం నోటిఫై చేసిన ఏడు ప్రత్యేక బీసీ ముస్లిం వర్గాలలో ఒకదానికి చెందిన సభ్యులుగా వారిని గుర్తిస్తూ కమ్యూనిటీ సర్టిఫికేట్లు జారీ చేయడానికి కూడా ఈ ఉత్తర్వు అనుమతించింది. తమిళనాడు ప్రభుత్వ భావన చట్టపరంగా మరియు భావనాత్మకంగా పూర్తిగా తప్పని మద్రాస్ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. "ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి వెనుకబడిన తరగతి ముస్లిం హోదాను పొందలేరని మేము నిర్ధారిస్తున్నాము. మతం మారిన వ్యక్తి కేవలం ఒక ముస్లిం మాత్రమే అవుతాడు, అంతే తప్ప ప్రత్యేక వర్గానికి చెందడు" అని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ప్రత్యేక వెనుకబడిన ముస్లిం వర్గాలలో అన్సార్, దక్కనీ ముస్లింలు, దుబేకుల, లబ్బాయి, మాపిళ్ళ, షేక్, సయ్యద్ ఎవరైనా కొత్తగా మతం మారిన వారిని సభ్యునిగా పరిగణించడం సాధ్యం కాదని, అందువల్ల వారు ఆ వర్గం కింద రిజర్వేషన్లు పొందడానికి అర్హులు కారని కోర్టు తేల్చి చెప్పింది. జూలై 2008లో జారీ చేసిన ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా తమిళనాడులోని పైన పేర్కొన్న ఏడు ముస్లిం వర్గాలను ప్రత్యేక కేటగిరీలో చేర్చారు. అయితే, ఇతర సామాజిక వర్గాల నుండి ఇస్లాంలోకి మారిన వారికి కూడా ఈ సర్టిఫికేట్లు ఇవ్వాలనే 2024 నాటి ప్రభుత్వ నిర్ణయం చెల్లదని హైకోర్టు స్పష్టం చేయడంతో తమిళనాడు ప్రభుత్వానికి దౌత్యపరంగా పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

# అయోధ్య విరాళాలు దుర్వినియోగంలో 8మంది అరెస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** యోధ్యలోని రామమందిరానికి వచ్చిన విరాళాలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యుడు కృష్ణ మోహన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఎఫ్ఐఆర్‌లో పేర్లున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి వివరాలను రాబట్టేందుకు విచారణ చేపడుతున్నారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. మరోవైపు, రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో సిట్ దర్యాప్తు అంత సంతృప్తిగా లేదని అయోధ్య ఆలయ పూజారులు అసహనం వ్యక్తం చేశారు. అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగంపై ఏర్పాటైన సిట్ రెండు రోజుల క్రితం తమ ప్రాథమిక నివేదికను ఉత్తర్‌ప్రదేశ్ సర్కారుకు సమర్పించింది. నిందితులపై కఠినమైన చర్యలకు సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో ఎనిమిది మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వారిని అరెస్ట్ చేశారు. ఈ అరెస్టైన వ్యక్తుల్లో శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్‌రాయ్ డ్రైవర్



కూడా ఉన్నాడు. "అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాశ్ శ్రీవాస్తవ, రామశంకర్ యాదవ్‌లపై ఎఫ్ఐఆర్‌లో నమోదైంది. వీరంతా ఆలయానికి వచ్చిన విరాళాలు, విలువైన వస్తువులను లెక్కించే ప్రక్రియలో పాలుపంచుకున్నారు. గురువారం రాత్రి ఈ ఎనిమిది మందిని అరెస్టు చేశాం. తదుపరి విచారణ కొనసాగుతోంది. నిందితులందర్నీ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం" అని పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. రామమందిర విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలపై ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో అయోధ్య పూజారులు కీలక వ్యాఖ్యలు చేశారు. కోట్లాది మంది భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని త్వరగా, పారదర్శకంగా ముగించాలని కోరుతున్నారు. సిట్ దర్యాప్తు తీరుపై ఆధ్యాత్మిక ప్రవచనకర్త కర్పత్రి మహారాజ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సిట్ దర్యాప్తుతో తాను సంతృప్తి చెందలేదన్నారు. బాధితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరారు. నిందితులను అయోధ్య విడిచి వెళ్లేలా చేయాలని డిమాండ్ చేశారు. "సిట్ నివేదిక సమర్పించిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ ఎఫ్ఐఆర్‌లో ఎనిమిది మంది పేర్లు ఉన్నాయి. ఈ కేసు తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ఒకవేళ ఎవరైనా దోషులుగా తేలితే వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును వేగంగా పూర్తి చేయాలి. నిందితులపై తీసుకునే చర్యలు రాబోయే శతాబ్దాల పాటు గుర్తుండిపోవాలి" అని కర్పత్రి మహారాజ్ పేర్కొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# సుల్తాన్‌పూర్ గ్రామం ముద్దుబిడ్డ రాజయ్య గౌడ్ ప్రతిభ





**- నితిన్ చేతుల మీదుగా "ఇట్స్ లైఫ్ బ్రో" ఫస్ట్ లుక్ విడుదల**

**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జూన్ 25:-** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన యువ దర్శకుడు ఈ రాజయ్య గౌడ్ చిన్ననాటి కలని నిజం చేసుకుంటూ కష్టాన్నే నమ్ముకొని సినిమా ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈడిగి రాజయ్య గౌడ్ రూపొందించిన కథ స్క్రీన్‌ప్లే అందిస్తున్న సరికొత్త చిత్రం "ఇట్స్ లైఫ్ బ్రో". కెఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై కృష్ణ మోహన్ సల్లగుండ్ల నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను టాలీవుడ్ స్టార్ హీరో నితిన్ చేతుల మీదుగా ఘనంగా విడుదల చేశారు.?నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఒక అద్భుతమైన భావోద్వేగ ప్రేమకథగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో కృష్ణ మోహన్ పూజా సుందర్ శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఫస్ట్ లుక్ విడుదల చేసిన హీరో నితిన్‌కు చిత్ర యూనిట్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలను చిత్ర బృందం ప్రకటించనుంది.?

గ్రామంలో పండుగ వాతావరణం

కుటుంబ సభ్యుల హర్షం

సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఒక సాధారణ యువకుడు సినిమా ఇండస్ట్రీలో ఈ స్థాయికి ఎదగడం పట్ల స్థానిక గ్రామస్తులు రాజయ్య కుటుంబ సభ్యులు పండగ చేసుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఈడిగి సాబయ్య గౌడ్ - యాదమ్మ దంపతులకు 17.04.1991 లో జన్మించిన మొదటి సంతానమే ఈ రాజయ్య. సాబయ్య గౌడ్‌కు ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె పెద్ద కుమారుడు రాజయ్య కాగా రెండవ కుమారుడు ఉమేష్ గౌడ్,కుమార్తె విజయలక్ష్మి. తన పెద్ద కుమారుడు సినీ రంగంలో ఇంతటి ఉన్నత స్థాయికి చేరుకోవడంపై తండ్రి సాబయ్య గౌడ్,తల్లి యాదమ్మ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు.?"నా కొడుకు చిన్నప్పటి నుండి సినిమా స్టోరీలు రాయాలి, దర్శకుడు కావాలని కోరుకునేవాడు. అనుకున్న లక్ష్యం కోసం 2011 నుండి ఎన్నో కష్టాలు పడ్డాడు. రాత్రింబవళ్లు శ్రమించి ఈరోజు ఈ స్థాయికి రావడం తండ్రిగా నాకు ఎంతో గర్వంగా ఉంది."ఈడిగి సాబయ్య గౌడ్ (రాజయ్య తండ్రి)?15 ఏళ్ల నిరంతర శ్రమకు దక్కిన ప్రతిఫలం ?సినిమా రంగంలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా కేవలం తన ప్రతిభను కథను నమ్ముకుని రాజయ్య గౌడ్ ముందడుగు వేశారు. 2011లో మొదలైన ఆయన సినీ ప్రయాణం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నేడు "ఇట్స్ లైఫ్ బ్రో" చిత్రంతో ఒక మైలురాయిని అందుకుంది.?తమ ఊరి పల్లె పడుచుల యువకుల కథలను వెండితెరపై చూపించబోతున్న రాజయ్యను చూసి సుల్తాన్‌పూర్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక సాధారణ దౌల్తాబాద్ మండలం యువకుడు టాలీవుడ్ స్టార్ హీరో నితిన్ చేతుల మీదుగా ఫస్ట్ లుక్ విడుదల చేసే స్థాయికి ఎదగడం కొడంగల్ నియోజకవర్గానికే గర్వకారణమని స్థానికులు కొనియాడుతున్నారు. ఈ చిత్రం పెద్ద విజయం సాధించి రాజయ్య గౌడ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

## ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సంఘం లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి డీసీపీ షిరీష రాఘవేంద్ర మరియు ఏసీపీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో గౌరవం, గుర్తింపు, మంచి స్థానం పొందడానికి విద్య ఒక్కటే శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని, క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు.




అదేవిధంగా, యువత జీవితాలను నాశనం చేస్తున్న ప్రధాన సమస్యల్లో మాదక ద్రవ్యాల వినియోగం ఒకటని, మత్తు పదార్థాల ప్రభావానికి లోనైతే ఆరోగ్యం, విద్య, కుటుంబ సంబంధాలు మరియు భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని వివరించారు. స్నేహితుల ఒత్తిడి, తప్పుడు ఆకర్షణలు లేదా ఆసక్తి పేరుతో మాదక ద్రవ్యాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు. సమాజాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏసీపీ మాట్లాడుతూ, విద్యార్థులు తమ చుట్టూ జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా మాదక ద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. యువతే దేశ భవిష్యత్తు అని, వారు ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీమతి విజయలక్ష్మి (జిల్లా వైద్య ఆరోగ్య అధికారి -- ఐవీఎూ) శ్రీమతి ప్రీతి (రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్), పోలీస్ అధికారులు సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజిక నష్టాలను వివరించి, "మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి -- ఆరోగ్యకరమైన, ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకుందాం!!" అనే సందేశాన్ని అందించారు.

## రోడ్డు తవ్వి వదిలేశారు చర్యలు తీసుకోకుంటే మున్సిపల్ ఆఫీస్ ఎదుట తీవ్ర ఆందోళన చేస్తాం

**-కొర్ర శంకర్ నాయక్,తండా వాసి**
**-నిధులు విడుదలైనా పూర్తికాని రోడ్డు పనులు**
**-చెట్లు పెరిగి, బండలతో నరకప్రాయంగా మారిన దారి**
**-అధికారుల నిర్లక్ష్యంపై బద్రునాయక్ తండా ప్రజల తీవ్ర ఆగ్రహం**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ గ్రామం, బద్రునాయక్ తండా (5వ వార్డు) ప్రజల సమస్యల పట్ల అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, బిల్లులు కూడా విడుదల చేసినప్పటికీ కాంట్రాక్టర్ పనులను సగంలోనే వదిలేశారని తండా నివాసి కొర్ర శంకర్ నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల్లోగా ఈ సమస్యను పరిష్కరించకుంటే షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆత్మబలిదానం చేసుకుంటానని ఆయన అధికారులను హెచ్చరించారు.

**నరకప్రాయంగా మారిన దారి**

ఇప్పటికే ఉన్న రోడ్డును తవ్వి అలాగే వదిలేయడంతో అక్కడ చెట్లు పెరిగిపోయాయని, పనులకు సంబంధించిన బండలు, మట్టి, రాళ్లను కూడా తొలగించకపోవడంతో ప్రయాణం పూర్తిగా అసాధ్యంగా మారిందని బాధితులు పేర్కొన్నారు. దీనివల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవల వాహనాలు (అంబులెన్స్ వంటివి) కూడా రాలేని దుస్థితి ఏర్పడింది. వర్షం వస్తే బురద, ఎండకు దుమ్ముతో ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కాంట్రాక్టర్ గుంభనత్వం.. అధికారుల అలసత్వం**

రోడ్డు పనులపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే సమాధానం దాటవేస్తున్నారని, ఈ విషయమై షాద్‌నగర్ మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని శంకర్ నాయక్ తెలిపారు. పట్టణ కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బద్రునాయక్ తండా పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, ఇక సుదూర ప్రాంతాల్లోని గిరిజన తండాల పరిస్థితి ఎలా ఉంటుందో పాలకవర్గానికే వదిలేస్తున్నామని మండిపడ్డారు.'మురికిలో బతకడం కంటే చావడమే మేలు. తండా ప్రజల సమస్యల కోసం దేనికైనా వెనుకాడను. 15 రోజుల్లోగా అధికారులు స్పందించి, నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రోడ్డు పనులు పూర్తి చేయాలి. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆత్మబలిదానానికి వెనుకాడను."

**- కొర్ర శంకర్ నాయక్, బద్రునాయక్ తండా నివాసి**

ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని, తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో తండా ప్రజలందరితో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు డిమాండ్ చేశారు.

## సహస్ర కలశాభిషేకం (1008) కలశములతో జరుగు శ్రీ వారి జ్యేష్టాభిషేకం కార్యకమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన గాంధీ





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు లో గల సెవెన్ హిల్స్ లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన సహస్ర కలశాభిషేకం (1008) కలశములతో జరుగు శ్రీ వారి జ్యేష్టాభిషేకం కార్యకమంలో ఈవో సత్యనారాయణ, తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి మరియు అమ్మవార్లకు విశేషంగా తిరుమంజనము, జేష్ట మాసంలో స్వామి వారికి జ్యేష్టాభిషేకం జరుగును. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పంచదార, చెరుకు రసం, ఫలహారంలతో, జాజికాయ, లవంగాలు, జాపత్రి, యాలకులు, పచ్చకర్పూరం,కచ్చులం,కస్తూరి, సుగంధ ద్రవ్యములతో స్వామి వారికీ ఈ జేష్టమాసంలో అభిషేకం విశేషంగా జరుగును అని, గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమం అని, ప్రజలందరిపైన స్వామి వారి కృప కలుగునని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదర్ నగర్ లో ఘనంగా మొహర్రం వేడుకలు

**- త్యాగాలకు, ధర్మ పోరాటాలకు ప్రతీక మొహరం-గాంధీ**






**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హైదర్ నగర్ లో జరిగిన మొహర్రం వేడుకలలో తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న పియేసి చైర్మన్ అరెకపూడి గాంధీ..

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి పవిత్ర మాసం మరియు ముస్లింల నూతన సంవత్సర ఆరంభం. ఇది కేవలం పండుగ మాత్రమే కాదు, మహమ్మద్ ప్రవక్త మనవడైన హాజరత్ ఇమామ్ హుసైన్, ఆయన కుటుంబ సభ్యుల త్యాగాలను మరియు ధర్మ పోరాటాన్ని స్మరించుకుంటూ (సంతాప దినాలుగా) జరుపుకునే ఒక ముఖ్యమైన మాసం. మొహర్రం పండుగ అని తెలియచేసారు. అదేవిదంగా మొహర్రాన్ని "పీర్ల పండుగ" అని కూడా పిలుస్తారు. త్యాగాల స్మరణ: కర్బలా యుద్ధంలో అమరులైన ఇమామ్ హుసైన్, ఇతర వీరులకు ప్రతీకగా హస్తాకృతి కలిగిన "పీర్లను" అలంకరించి, భక్తిశ్రద్ధలతో ఊరేగింపులు నిర్వహిస్తారు. ఆషూరా (10వ రోజు): మొహర్రం నెలలో పదవ రోజును "ఆషూరా" అంటారు. ఇది చాలా పవిత్రమైన రోజు. షియా ముస్లింలు ఈ రోజున సంతాప ఊరేగింపులు నిర్వహిస్తూ, మాతం (ఛాతీని బాదుకుంటూ విచారం వ్యక్తం చేయడం) జరుపుకుంటారు అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, పోతుల రాజేందర్,చాట్ల రవి,రాజి రెడ్డి,షరీఫ్,యాసిన్, నిఖిల్, హమీద్, ఫసి, ముస్లిం మత పెద్దలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు సవరణలో ప్రతి వ్యక్తి బాధ్యత వహించాలి

**-పర్వతాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన బీజేపీ షాద్నగర్ బిఎల్ఎ-1 కందూరి మనోహర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కక్కునూరు వెంకటేష్ గుప్తా.**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** కొందుర్గు మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో బిజెపి బిఎల్ఏ-1 కందూరి మనోహర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కక్కునూరు వెంకటేష్ గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రక్రియ నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్యుమరేటర్ తో కలిసి ఓటర్లకు ఫారాల పంపిణీ చేసి, సంబంధిత అధికారులతో మాట్లాడి నమోదు ప్రక్రియ, అవసరమైన పత్రాల పరిశీలన, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఓటరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను కోరారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. అలాగే, ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజలకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మంగన్నగారి బలవంత్ రెడ్డి, పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్, ఉపసర్పంచ్ దామోదర్ రెడ్డి, బిఎల్ఎ-2 మరాటి సురేష్, నాయకులు మల్లేష్, బూత్ అధ్యక్షుడు సిద్దయ్య, బాలప్ప, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ పోలీసుల మరియు ఎస్ఓటి వారి ఆధ్వర్యంలో 650 గ్రాముల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్ట్



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ పట్టణంలోని నేషనల్ మార్ట్ సమీపంలో గంజాయి వినియోగం జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంపై శుక్రవారం షాద్‌నగర్ పోలీసులు వెంటనే స్పందించి దాడి నిర్వహించారు.
పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. పోలీసులు చూడగానే వారు పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు. వారి వద్ద తనిఖీ నిర్వహించగా సుమారు 650 గ్రాముల గంజాయి లభ్యమైంది.

**పట్టుబడిన నిందితులు:**

1. గంగా మాడి (21), ప్రైవేట్ ఉద్యోగి.
2. రమేష్ కుమార్ (18), సెక్యూరిటీ గార్డ్.

విచారణలో మొదటి నిందితుడు శ్రీకాకుళం ప్రాంతం నుండి గంజాయిని కొనుగోలు చేసి షాద్‌నగర్‌కు తీసుకొచ్చినట్లు, ఇద్దరూ కలిసి గంజాయి సేవించినట్లు ఒప్పుకున్నారు.
నిందితుల వద్ద నుండి లిలి650 గ్రాముల గంజాయి, రెండు రెడ్‌మీ మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం 1985 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది.షాద్‌నగర్ పోలీసులు మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు మరియు వినియోగంపై కఠిన చర్యలు కొనసాగిస్తారని, ప్రజలు ఇలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మృతి చెందిన వడ్డే రాజుకు సంతాపం

వ్యక్తం చేసిన... ప్రముఖ సంఘ సేవకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**ఆమనగల్లు,జూన్26 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని చంద్రధన గ్రామానికి చెందిన వడ్డే రాజు గురువారం రాత్రి మృతి చెందడం జరిగింది.ఆ విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము శుక్రవారం మృతి చెందిన వడ్డే రాజు నివాసానికి వెళ్లి ఆ మృతదేహాన్ని సందర్శించి ఆయన పార్థీహదేహంపై పూలమాలలు వేసి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. వారి కుటుంబాన్ని ఓదార్చి, వారికి ధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రధన గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ సుధాకర్, ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి,శ్రీను నాయక్ , ప్రేమ్, కళ్యాణ్ కార్ జహంగీర్, జంగయ్య గౌడ్,శంకర్, శేఖర్ యాదవ్,రాములు, శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటకు కట్టుబడి సొంత నిధులతో హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా డా. లక్ష్మికాంత్ రెడ్డి



**నారాయణపేట, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** మక్తల్ నియోజక వర్గంలోని వివిధ మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు స్వంత నిధులతో హైమాస్ట్ లైట్స్ ఎపిస్తానని మాట ఇచ్చిన ప్రకారం సొంత నిధులతో బిజేపి రాష్ట్ర నాయకుడు బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు.అందులో భాగంగానే కృష్ణ మండలంలోని గుడెబల్లూర్, హిందుపూర్ చౌరస్తా దగ్గర, ఉట్కూర్ మండలంలోని వల్లంపల్లి గ్రామం, మరికల్ మండలంలోని పుట్టగడ్డ అప్పంపల్లి గ్రామాల్లో స్వంత నిధులతో హైమాస్ట్ లైట్స్ ను బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి నారాయణపేట జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు పగడాకుల శ్రీనివాస్ తో కలిసి కొన్ని చోట్ల భూమి పూజ కూడా చేసారు. హైమాస్ట్ లైట్స్ ఏపించిన బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డికి బీజేపీ శ్రేణులు అభినందనలు తెలిపారు. ఇట్టి హైమాస్ట్ లైట్స్ ని త్వరలోనే ప్రారంభిస్తారని ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు శ్యాంసుందర్ గౌడ్ , వల్లంపల్లి సర్పంచ్ వెంకట్రాములు, మరికల్ మండలం జిల్లా కౌన్సిల్ సభ్యులు వై. తిరుపతి రెడ్డి , కృష్ణ మండలం బీజేపీ అధ్యక్షులు నల్లే నర్సప్ప, బీజేపీ పదాది కారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు



**ఉమ్మడి వరంగల్, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఆరోగ్యకరమైన వ్యాయామ అలవాట్లతో జీవితం ముందుకు సాగాలని ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజ్ పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మత్తు పదార్థాలు ధూమపాన నివారణ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన 2కె రన్ లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ ఇనుగాలవెంకట్రామిరెడ్డి,కలెక్టర్లు డా.సత్య శారద,చాహత్ బాజ్‌పాయ్, ఎన్పీడీసీఎల్ ఎండి వరుణ్ రెడ్డి,వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తో కలిసి పోలీస్ కమిషరేట్ కార్యాలయం నుండి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకు నిర్వహించిన ర్యాలీలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ వ్యాయామం ఆరోగ్యకరమైన అలవాట్లతో జీవితం ముందుకు సాగాలని ఆయనపిలుపునిచ్చారు.యువత మాదకద్రవ్యాల జోలికిపోవద్దని, మత్తులో పడితే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనిపిలుపునిచ్చారు.ర్యాలీ అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లోమాదకద్రవ్యాల నిర్మూలలపై ప్రతిజ్ఞ కార్యక్రమంనిర్వహించారు.యువకులు,స్థానికులు జిల్లా అధికారులు పెద్ద ఎత్తున ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, సమాజంలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.2కె రన్ విజేతలను ఎమ్మెల్యే అభినందించి, విజేతలకు మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేశారు.

# భార్యతో గొడవ.. యువకుడు ఆత్మహత్య



**ఎల్బీనగర్, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** భార్యతో జరిగిన స్వల్ప గొడవ మనస్తాపానికి గురిచేయడంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెందిన గుట్ల రాజేష్ (26) వృత్తిరీత్యా డిజైనర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య ఆశ ప్రవళికతో కలిసి వనస్థలిపురం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన టీజీపిఎల్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించి ఇంటికి చేరుకున్న రాజేష్, అనంతరం తన స్నేహితుడు విజయ్‌కుమార్‌తో కలిసి మద్యం సేవించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో భార్యతో స్వల్ప వాగ్వాదం జరిగినట్లు వెల్లడించారు. ఆ తర్వాత అర్ధరాత్రి సమయంలో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని రాజేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వనస్థలిపురం పోలీసులు తెలిపారు.

## లక్ష్మీ ప్రియా కాలనీలో నూతన సీసీ రోడ్లను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్; జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ ప్రియా కాలనీలో తన హయాంలో మంజూరైన నిధులతో నిర్మించిన నూతన సీసీ రోడ్ల పనులు పూర్తికావడంతో, మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్రవారం ఆ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణ నాణ్యతను పరిశీలించిన ఆయన, కాలనీవాసులకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులకు సన్మానం



**మందమర్రి జూన్26 (జర్నలిస్ట్ డైరీ) :** నూతనంగా ఎన్నికైన మందమర్రి ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం రోజున ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు.అధ్యక్షులు గజ్జల చందర్, ప్రధాన కార్యదర్శి సలామొద్దీన్, కోశాధికారి సకినాల శంకర్ లకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మంచిర్యాల జిల్లా కమిటీ, మందమర్రి పట్టణ, మండల కోర్ కమిటీ సభ్యులు సన్మానం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యమ సమయంలో ఉద్యమ విషయాలను, ప్రజలలోకి తీసుకు వెళ్తూ, ఉద్యమాన్ని ఉధృతం చేసిన విలేకరులందరికీ వందనాలు తెలియజేశారు. ఆదివారం రోజున హైదరాబాదు నుండి కోడంగల్ వరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డాక్టర్ చీమ శ్రీనివాస్ నేతృత్వంలో కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణ మలిదశ ఉద్యమకారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అందర్నీ ఆహ్వానిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయోలా కుమార్,ఎం.వెంకటేష్ గౌడ్, సుంకర. లక్ష్మణరావు,మొయ్య రాంబాబు, పలిగిరి కనకరాజు, రాజనర్సు,ఎండి పాషా,డబ్లు.సురేందర్,పోల్. కుమార్,పల్లె. నరసింహులు,కొండిళ్ల శ్రీనివాస్, ఖలీమ్,ఎగుడ రాజమల్లు, పారుపల్లి శివరామకృష్ణ, పాత వీరస్వామి,వేల్పుల బాపూరావు,పెనుగొండ సమ్మయ్య,ఐలోని రమేష్ తదితరులు,పాల్గొన్నారు.

# మత్తు వద్దు ..మంచి భవిష్యత్తు ముద్దు ,డ్రగ్స్ కు నో చెప్పండి బంగారు జీవితానికి బాట వేయండి




**కూకట్పల్లి జూన్26 (జర్నలిస్ట్ డైరీ) :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం -- 2026 సందర్భంగా కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ నగర్ నుండి నిజాంపేట్ మెయిన్ రోడ్ వరకు డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఇనుమాటిక్స్ ఏ ఐ కోచింగ్ సెంటర్ వారి సహకారంతో నిర్వహించగా, సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.
ర్యాలీలో "మత్తు వద్దు... మంచి భవిష్యత్తు ముద్దు!", "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి అవును చెప్పండి, మత్తు రహిత భవిష్యత్తును ఎంచుకోండి" అనే సందేశాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. వినూతన కార్యక్రమలు అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజాహితం తో నిత్య నూతన కార్యక్రమలు నిర్మావహించే కె పి హెచ్ బి పోలీస్ స్టేషన్ అధికారులు సమిష్టి కృషి తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ సి ఐ, డిటెక్టీవ్ ఇన్స్పెక్టర్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం





**సందర్భంగా జడ్చర్లలో భారీ వాకథాన్ ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్**

**మిడ్జిల్, జూన్ 26, (జర్నలిస్ట్ డైరీ) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియం, బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జడ్చర్ల పోలీసుల ఆధ్వర్యంలో భారీ అవగాహన వాకథాన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది విద్యార్థులు, వాకర్స్, యువత, మహిళలు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక దుష్ప్రవర్తన అని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ వైపు మళ్లే యువత తమ జీవితాలను, కుటుంబాల ఆశలను, సమాజ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణం వ్యాపార, విద్యా మరియు రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉండటంతో, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడ నివసిస్తూ ఉంటారని, ఈ పరిస్థితుల్లో మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణాకు అవకాశాలు పెరిగే అవకాశం ఉందని ఎస్పీ హెచ్చరించారు. ప్రత్యేకంగా విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారి భవిష్యత్తు సురక్షితంగా ఉండేలా అందరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజికంగా తీవ్రమైన నష్టాలు సంభవిస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తి క్రమంగా కుటుంబానికి దూరమవడమే కాకుండా నేరప్రవర్తన వైపు వెళ్లే ప్రమాదం కూడా ఉంటుందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాను పూర్తిగా డ్రగ్-ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడం పోలీసు శాఖ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనలో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలందరి సహకారం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ప్రదర్శించడం జరిగింది. తర్వాత I Am An Anti-Drug Soldier సెల్ఫీ స్టాండ్ వద్ద విద్యార్థులు, అధికారులు, ప్రజలు ఫోటోలు దిగుతూ డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని బలంగా చాటిచెప్పారు. తదుపరి మినీ స్టేడియం నుండి నేతాజీ చౌరస్తా వరకు భారీ వాకథాన్ ర్యాలీ నిర్వహించబడింది. ర్యాలీ మొత్తం డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సందడి చేసింది.




నేతాజీ చౌరస్తా వద్ద జిల్లా ఎస్పీ అందరితో కలిసి మాదకద్రవ్యాల వినియోగాన్ని దూరం పెట్టాలని, సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మినీ స్టేడియంకు తిరిగి చేరుకున్న తర్వాత విద్యార్థులు, ప్రజలు మానవహారంగా నిలబడి మాదకద్రవ్యాల నిర్మూలనకు మద్దతుగా పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, వాకింగ్ అసోసియేషన్ సభ్యులు, యోగా సభ్యులు, విద్యార్థులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ఇంత పెద్ద స్థాయిలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జడ్చర్ల పోలీసు సిబ్బందిని పట్టణ ప్రజలు అభినందిస్తూ, పోలీసు శాఖ చేపడుతున్న డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

# మొహరం వేడుకల్లో ఆధ్యాత్మిక శోభ.. సందడిగా పీర్ల ఊరేగింపు






**త్యాగానికి ప్రతీక మొహరం**

**మిడ్జిల్ ,జూన్26, (జర్నలిస్ట్ డైరీ) :** త్యాగానికి ప్రతీకైనా మొహరం పండుగను మిడ్జిల్ మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం హిందూ,ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని పీర్ల మసీదులో 9 రోజులపాటు జాగరణ చేసి,ప్రజలు నిత్యం రాత్రి పీర్లచావిడి వద్ద అలవ, కోలాటం ఆడారు.అనంతరం సవారిలకు పతేహాలు,దటీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.పీర్ల సవారితో పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు.భక్తులు, ప్రజలు,పీర్ల సవారీలకు బెల్లం,కొబ్బరి దట్టిలను సమర్పించి స్థానిక ముస్లిం సోదరులు ప్రజలకు పాలు,బెల్లం పానకాలను అందజేశారు.రాత్రి స్థానిక చెరువులో పేర్లను నిమజ్జనం చేశారు.



# కాలువలో పడి వృద్ధురాలి మృతి

**నిడమనూర్, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** నిడమానూరు మండలం బొక్కముంతలపహాడ్ గ్రామనికి చెందిన మృతురాలు రమావత్ లక్ష్మికి ఈత రాదు ఆమె తన ఇంటి సమీపంలో ఉన్న ఎన్.ఎస్.పి ఎడమ కాలువ వద్దకు మలమూత్ర విసర్జన కోసం రోజు క్రమం తప్పకుండా వెళ్లేవారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సుమారు 05:30 గంటల సమయంలో ఆమె కాలువ వద్దకు వెళ్లారు కానీ తిరిగి రాలేదు చెప్పులు చేతి కర్ర కాలువ ఒడ్డున పెట్టి కాలువలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి కాలువలో పడి, నీటిలో మునిగి మృతి చెందింది ఉదయం సుమారు 07:30 గంటలకు కంపాసాగర్ వంతెన సమీపంలోని ఎన్.ఎస్.పి ఎడమ కాలువలో ఆమె మృతదేహం లభించింది. దీనిపై బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 194 కింద క్రైమ్ నంబర్ 142/2026 కిద మృతురాలి కుమారుడు ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసి ఎంక్వయిరీ చేస్తున్నట్టు నిడమనూరు ఎస్సై డి.విజయ్ కుమార్ తెలిపారు.



# టయోటా షోరూంలో ఘనంగా అర్బన్ క్రూజర్ ఎబెల్లా కారు ఆవిష్కరణ


**వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన ఫీచర్లతో అర్బన్ క్రూజర్ ఎబెల్లా: మధుయాష్కి గౌడ్**




**ఎల్బీనగర్, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** చింతల్‌కుంటలోని టయోటా షోరూంలో నూతనంగా మార్కెట్‌లోకి తీసుకొచ్చిన అర్బన్ క్రూజర్ ఎబెల్లా కారును టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని శుక్రవారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, వినియోగదారుల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా అత్యాధునిక ఫీచర్లు, నాణ్యమైన సేవలు అందించినప్పుడే ఆటోమొబైల్ సంస్థలు ప్రజల ఆదరణ పొందగలవని పేర్కొన్నారు. అనంతరం షోరూం నిర్వాహకులు నూతన అర్బన్ క్రూజర్ ఎబెల్లా కారులో పొందుపరిచిన ఆధునిక సాంకేతిక ఫీచర్లు, భద్రతా ప్రమాణాలు, ఇతర ప్రత్యేకతలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కొత్తకురుమ శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు బుద్దా సత్యనారాయణ, మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహా యాదవ్, శ్రీపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, బద్దుల వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవీందర్, ఈశ్వరమ్మ యాదవ్, వేములయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగోల్‌లో శ్రావ్స్ నాన్ వెజ్ టిఫిన్స్ ప్రారంభం

**ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్**




**కొత్తపేట, జూన్ 26 (జర్నలిస్ట్ డైరీ) :** కొత్తపేట నుంచి నాగోల్ మెయిన్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "శ్రావ్స్ నాన్ వెజ్ టిఫిన్స్" ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువ పారిశ్రామికవేత్తలు వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన నిర్వాహకులు, బీజేపీ నాయకుడు తోట మహేందర్ యాదవ్కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెంది ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నిరుపేదకు జిఎంఆర్ నిత్యావసర సరుకుల పంపిణి




**నారాయణఖేడ్,జూన్26 (జర్నలిస్ట్ డైరీ) :** నిజాంపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నిరుపేద చాకలి భాగయ్య కుటుంబానికి జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ ఆదేశాల మేరకు,శుక్రవారం నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవయ్య, భూమయ్య, సందీప్,ఫౌండేషన్ ప్రతినిధులు నమిల్ల హన్మండ్లు, అభి పవర్, వార్డ్ సభ్యులు లక్ష్మయ్య,దుర్గయ్య, సురేందర్, సంతు,రవి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# బిజినెస్

## సామాన్యుడికి అందనంత దూరంలో కోడిగుడ్డు.

### -త్వరలో రూ.10కి చేరనున్న ధర!

**హైదరాబాద్,**



సామాన్యుడికి అత్యంత అందుబాటులో ఉండే ప్రోటీన్ ఆహారం 'కోడిగుడ్డు'. అయితే, ఇప్పుడు ఆ గుడ్డు ధర సామాన్యుడి జేబుకు చిల్లులు పెడుతోంది. గత రెండు నెలలుగా గుడ్డు ధరలు నిరంతరం పెరుగుతూ వస్తుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

**ధరల పరుగు ఇలా..**

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఒక కోడిగుడ్డు ధర రూ. 4 ఉండగా, అది క్రమంగా పెరుగుతూ మే నెల నాటికి రూ. 5కు చేరుకుంది. జూన్ నెలాఖరు సమయానికి ఈ ధర రూ. 8 మార్కును తాకింది. పరిస్థితి చూస్తుంటే, రాబోయే కొద్ది రోజుల్లోనే ఒక కోడిగుడ్డు ధర ఏకంగా రూ. 10కు చేరుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

**ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు:**

కోడిగుడ్డు ధరలు అసాధారణంగా పెరగడానికి ప్రధానంగా కొన్ని కారణాలు ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు:

**తీవ్రమైన ఎండలు:** ఈ వేసవిలో నమోదైన తీవ్రమైన ఉష్ణోగ్రతల వల్ల కోళ్ల ఫారమ్‌లలో సుమారు 10% కోళ్లు మరణించాయి. దీనివల్ల గుడ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది.

**ఉత్పత్తి వ్యయం:** కోళ్ల మేత ధరలు ఆకాశాన్ని తాకడం, అలాగే కోళ్లకు అందించే మందుల ఖర్చులు కూడా పెరగడంతో రైతులు ఆ భారాన్ని వినియోగదారులపై వేయక తప్పడం లేదు.

**సరఫరాలో అంతరాయం:** డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడం కూడా ధరల పెరుగుదలకు ప్రధాన ఇంధనంగా మారింది.

**సామాన్యుడిపై భారం**

సాధారణంగా నిరుపేదలకు, మధ్యతరగతి ప్రజలకు చౌకగా దొరికే పోషకాహారం కోడిగుడ్డు. కేవలం రూ. 10 లోపు దొరికే గుడ్డు, ఇప్పుడు పది రూపాయలకు చేరనుండటంపై సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల మోతతో సతమతమవుతున్న సామాన్యులకు, గుడ్డు ధరల పెరుగుదల అదనపు భారంగా మారింది.

ప్రభుత్వం లేదా సంబంధిత పౌరసరఫరాల శాఖ ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలని, పెరిగిన ధరల వల్ల ఎగ్-బేస్డ్ బిజినెస్ చేస్తున్న చిన్న చిన్న వ్యాపారులపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని స్థానికులు కోరుతున్నారు.

## పసిడికి రెక్కలు.. ఆకాశాన్ని అంటుతున్న బంగారం, వెండి ధరలు!

బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరల పరుగు ఏమాత్రం ఆగడం లేదు. ఎప్పుడూ లేని విధంగా మునుపెన్నడూ చూడని సరికొత్త గరిష్ట స్థాయిలకు బంగారం, వెండి ధరలు చేరుకున్నాయి. శుక్రవారం దేశీయ మార్కెట్‌లో వీటి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు బంగారం కొనాలంటేనే భయపడే స్థాయికి తాజా ధరలు చేరడం గమనార్హం.

**రికార్డు స్థాయిలో పసిడి ధరలు**

రోజురోజుకూ ఊహించని విధంగా పెరుగుతున్న పసిడి ధరలు కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. తాజా మార్కెట్ వివరాల ప్రకారం ధరల పెంపు ఈ విధంగా ఉంది:

**22 క్యారెట్ల బంగారం:** ఆభరణాల తయారీకి వినియోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల (తులం) బంగారం ధరపై ఒకేరోజు ఏకంగా రూ.1,300 మేర పెరిగింది. తాజా పెరుగుదలతో మార్కెట్‌లో దీని ధర రూ.1,30,850 కు చేరుకుంది.

**24 క్యారెట్ల బంగారం:** పెట్టుబడులకు, బిస్కెట్ల



రూపంలో కొనుగోలు చేసే శుద్ధ బంగారం అనబడే 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడిపై రూ.1,420 మేర పెరుగుదల నమోదైంది. దీంతో ప్రస్తుత ధర రూ.1,42,750 వద్ద రికార్డు స్థాయిలో పలుకుతోంది.

**వెండి కొనుగోలుదారులకు భారీ షాక్**

బంగారంతో పోటీ పడుతూ వెండి ధరలు కూడా రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. వెండి ధరల పెరుగుదల చూసి బులియన్ మార్కెట్ వర్గాలే విస్మయానికి గురవుతున్నాయి.


కిలో వెండి ధరపై ఏకంగా రూ.15,000 మేర భారీ జంప్ నమోదు కావడం మార్కెట్‌లో తీవ్ర సంచలనంగా మారింది. ఈ తాజా పెరుగుదలతో కిలో వెండి ధర ఏకంగా రూ.2,45,000 వద్ద కొనసాగుతోంది. పారిశ్రామిక వర్గాల నుంచి వస్తున్న డిమాండ్, అంతర్జాతీయ పరిణామాలే వెండి ధరల ఇంతలా పెరగడానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

**తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు**

ఈ ధరల పెరుగుదల ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాలపై స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాల్లో కూడా ఇవే పెరిగిన ధరలు వర్తించనున్నాయి. స్థానిక పన్నులు, తరుగు, మజూరీ వంటివి కలుపుకుంటే షోరూమ్‌లలో ఫైనల్ బిల్లు మరింత భారీగా ఉండే అవకాశం ఉంది.

## ఆసియా మార్కెట్ల భారీ పతనం.. ఎందుకు?

అమెరికా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఆసియా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. దక్షిణ కొరియా కోస్పీ 8%, జపాన్ నిక్కీ 5% క్షీణించాయి. యాపిల్ ఐప్యాడ్, మ్యాక్‌బుక్ ధరల పెంపు, ఏఐ మౌలిక వసతులపై అధిక ఖర్చు, పెరుగుతున్న సెమీ కండక్టర్ల ధరలు బిగ్ టెక్ కంపెనీలను ప్రభావితం చేస్తున్నాయన్న సంకేతాలు దీనికి కారణమయ్యాయి. యాపిల్ షేరు విలువ 6.1% పడిపోగా, ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, ఆల్ఫాబెట్ షేర్లు కూడా క్షీణించాయి. ఈ పరిణామం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెట్టుబడులపై ఇన్వెస్టర్లలో అనుమానాలను రేకెత్తించింది.



## చరిత్ర సృష్టించిన శ్రీచరణి

టీమిండియా స్పిన్నర్, తెలుగు తేజం శ్రీచరణి చరిత్ర సృష్టించింది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక వికెట్లు తీసిన తొలి ఆసియా ప్లేయర్‌గా నిలిచింది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో 4 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీయడం ద్వారా శ్రీ చరణి ఈ ఫీట్ సాధించింది. ఈ టోర్నీలో భాగంగా బుధవారం బంగ్లాదేశ్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో శ్రీచరణి రెండు వికెట్లు పడగొట్టింది. ఈ రెండు వికెట్లను ఆఖరి ఓవర్‌లో సాధించింది. ఆమె బౌలింగ్‌లో ధాటిగా ఆడబోయిన షోర్నా అక్తెర్, నహిదా అక్తెర్ వికెట్ పారేసుకున్నాడు. అంతకుముందు సౌతాఫ్రికా, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో మూడు వికెట్ల ఘనతను అందుకుంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టింది. ఈ టోర్నీలో రెడ్ హాట్ ఫామ్‌లో ఉన్న శ్రీచరణి మొత్తం 12 వికెట్లతో సింగిల్ ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన తొలి ఆసియా ప్లేయర్‌గా నిలిచింది. 17 ఏళ్ల మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే మరే ప్లేయర్ కూడా ఈ ఫీట్ సాధించలేదు. ఈ క్రమంలో ఆమె భారత బౌలర్ పూనమ్ యాదవ్ రికార్డ్‌ను అధిగమించింది. 2020 మహిళల టీ20 ప్రపంచకప్‌లో పూనమ్ యాదవ్ 10 వికెట్లు తీసింది. ఈ జాబితాలో దయానా డేవిడ్(9-



2010), పూనమ్ యాదవ్(8-2014), పూనమ్ యాదవ్(8-2018), రాధా యాదవ్(8-2018), ఫాతిమా సనా(8-2026) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతేకాకుండా సింగిల్ ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో రెండు, అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన తొలి ఆసియా ప్లేయర్‌గా కూడా శ్రీచరణి నిలిచింది. పూనమ్ యాదవ్(2014, 2018), రాధా యాదవ్(2018), రేణుకా ఠాకూర్(2024) ఈ ఫీట్ సాధించారు. పాకిస్థాన్ ప్లేయర్ అలియా రియాజ్(2018), ఫతిమా సనా(2026), సాదికా ఇక్బాల్(2026) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. గతేడాది మహిళల వన్డే ప్రపంచకప్‌లోనూ 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టి భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. శ్రీచరణి(2/21) అద్భుత ప్రదర్శనతో పాటు షెఫాలీ వర్మ(34 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 53) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగడంతో బంగ్లాదేశ్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 136 పరుగులే చేసింది. జుయారియా ఫెర్దోస్(31 బంతుల్లో 5 ఫోర్లతో 33), నిగర్ సుల్తానా(27 బంతుల్లో 4 ఫోర్లతో 32), సోభనా మోస్త్రే(26 బంతుల్లో 2 ఫోర్లతో 22) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో రాధా యాదవ్(3/28) మూడు వికెట్లు తీయగా.. రేణుకా సింగ్, నందని శర్మ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 16.5 ఓవర్లలో 5 వికెట్లకు 139 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. షెఫాలీ వర్మతో పాటు యస్తికా భాటియా(18 బంతుల్లో 3 ఫోర్లతో 23), జెమీమా రోడ్రిగ్స్(15 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26) విలువైన పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లలో రితూ మోనీ రెండు వికెట్లు తీయగా.. మరుఫా అక్తెర్, రాబేయా ఖాన్, నహిదా అక్తర్ తలో వికెట్ తీసారు. నాలుగు మ్యాచ్‌ల్లో 3 విజయాలతో టీమిండియా గ్రూప్-1లో రెండో స్థానంలో కొనసాగుతోంది.

## ఆస్ట్రేలియాను మరోసారి ఓడిస్తాం

### టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ధీమా

ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ 2026 టోర్నీ తరహాలోనే ఆస్ట్రేలియాను మరోసారి ఓడిస్తామని టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ధీమా వ్యక్తం చేసింది. ఆసీస్‌ను ఓడిస్తే తమ ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందని చెప్పుకొచ్చింది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పటిష్టమైన ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉంది. బంగ్లాదేశ్‌తో విజయానంతరం మాట్లాడిన హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ గెలుపుపై సంతోషం వ్యక్తం చేసింది. 'ఇది ఒక మంచి విజయం. మేం ఈ మ్యాచ్‌ను ఇంకాస్త ముందుగానే ముగించాల్సింది. అయినప్పటికీ 2-3 ఓవర్ల ఉండగానే విజయాన్ని అందుకోవడం చాలా మంచి విషయమే. మేం మా ఫీల్డింగ్‌పై చాలా శ్రమించాం.



అయినా ఈ మ్యాచ్‌లో కొన్ని క్యాచ్‌లు చేజార్చాం. వచ్చే మ్యాచ్‌లో మా అత్యుత్తమ ప్రదర్శనను చూపిస్తామని ఆశిస్తున్నాను. క్యాచ్‌లు వదిలిన ఆటగాళ్లు మా జట్టులోనే అత్యుత్తమ ఫీల్డర్లు, కానీ కొన్నిసార్లు ఇలా జరుగుతూ ఉంటుంది. నిరంతరం శ్రమిస్తూ.. క్యాచ్‌లు పడుతూ ఉంటే మైదానంలో సరైన పొజిషన్లలో ఉండగలం. ఈ మ్యాచ్‌లో మేం కొన్ని తప్పులు చేశాం. కానీ తదుపరి మ్యాచ్‌లో మా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తామని ఆశిస్తున్నాను. ఇక ఆస్ట్రేలియాతో తలపడడానికి మేం పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. వారు మా అత్యుత్తమ ప్రత్యర్థుల్లో ఒకరు. ఇలాంటి టోర్నమెంట్‌లలో ప్రతి మ్యాచ్ తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉన్నప్పుడు.. మన అత్యుత్తమ ప్రదర్శనను బయటకు తీయాలి. ఒకవేళ ఆస్ట్రేలియాపై మేం గెలిస్తే.. మాకు చాలా ఆత్మవిశ్వాసం వస్తుంది. గతంలో నవీ ముంబైలో సాధించిన విజయం మాకు ఎంతో నమ్మకాన్ని ఇవ్వడమే కాకుండా, మాకున్న కొన్ని అడ్డంకులను బద్దలు కొట్టింది.'అని వన్డే ప్రపంచకప్ విజయాన్ని హర్మన్‌ప్రీత్ కౌర్ గుర్తు చేసుకుంది. గతేడాది జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్-2లో టీమిండియా అద్వితీయమైన ప్రదర్శనతో చిరస్మరణీయమైన విజయాన్నిఅందుకున్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఆసీస్ విధించిన 338 పరుగుల లక్ష్యాన్ని భారత్ 9 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్) అజేయ శతకంతో ఈ మ్యాచ్‌లో సత్తా చాటింది. ఈ గెలుపు ఉత్సాహంతో ఫైనల్లో సౌతాఫ్రికాను ఓడించి తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. మరోసారి అదే తరహా ప్రదర్శనతో తొలి టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడాలనే కసితో హర్మన్ సేన ఉంది.

# స్పోర్ట్స్

## శతక్కొట్టిన జురెల్.. పోరాడుతున్న శ్రీలంక ఏ..!



అనధికారిక టెస్టులో భారత ఏ జట్టు కెప్టెన్ ధ్రువ్ జురెల్(141 నాటౌట్) శతకంతో రెచ్చిపోయాడు. సుదీర్ఘ ఫార్మాట్‌పై తనకున్న ఇష్టాన్ని పరుగుల రూపంలో చూపించగా.. శ్రీలంక ఏ బౌలర్లు కుదేలయ్యారు. భారీ స్కోర్ కొట్టిన టీమిండియా 452/6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడమే ఆలస్యం బౌలర్లు ప్రత్యర్థిని ఆదిలోనే దెబ్బతీశారు. నువనిందు ఫెర్నాండో(65 నాటౌట్) అర్ధ శతకంతో మెరవగా.. రెండు వికెట్ల నష్టానికి 113 రన్స్ కొట్టింది లంక ఏ.గాలే స్టేడియంలో జరుగుతున్న మొదటి అనధికారిక టెస్టులో భారత ఏ జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. కెప్టెన్ ధ్రువ్ జురెల్(141 నాటౌట్) శతకంతో రెండో రోజు టీ అనంతరం తొలిరోజు 452/6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన టీమిండియా.. ప్రత్యర్థిని దెబ్బకొట్టింది.

ఓపెనర్ నిరోషన్ డిక్‌వెల్(10)ను ఔట్ చేసిన అన్షుల్ కంభోజ్ లంకకు షాకిచ్చాడు. మరో ఎండ్‌లో అకీబ్ నబీ కట్టడి చేయగా.. యశ్ ఠాకూర్ ఓవర్లో పవంత వీరసింఘే వెనుదిరిగాడు. 38కే రెండు వికెట్లు పడిన వేళ.. నువనిందు ఫెర్నాండో(65 నాటౌట్), అషేన్ బండార(18 నాటౌట్) క్రీజునంటుకుపోయారు.

**తొలి వికెట్‌కు 92 రన్స్**

ఓపెనర్ సాయి సుదర్శన్(132), ఆయుష్ పాండే(25)లు భారత ఏ జట్టుకు శుభారంభమిచ్చారు. తొలి వికెట్‌కు 92 రన్స్ జోడించిన సాయి.. ఆ తర్వాత దేవ్‌దత్ పడిక్కల్(12), రుతురాజ్ గైక్వాడ్(22)లతో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు.అనంతరం షేక్ రషీద్(63), ధ్రువ్ జురెల్(141 నాటౌట్) మెరవగా.. తొలి రోజే 4 వికెట్ల నష్టానికి 333 రన్స్ కొట్టిన భారత్.. రెండో రోజూ జోరు చూపింది. హర్ష్ దూబే(30)తో కలిసి లంక బౌలర్లను విసిగించిన జురెల్ స్కోర్ నాలుగొందలు దాటించాడు. దూబేను గుణశేఖర( 3-84) ఔట్ చేశాక ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది



మత్తెక్కించే కాటుక కళ్ళతో.. దీపికా పిల్లి అందాలు..

# జైలర్ 2' రిలీజ్ డేట్ ఫిక్స్..


## అక్టోబర్‌లో రజనీకాంత్ మాస్ ట్రీట్‌కు రంగం సిద్ధం!




సూపర్ స్టార్ రజినీకాంత్ మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి సిద్ధమవుతున్నారు. గత కొంతకాలంగా వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉన్న తలైవా, ఇప్పుడు తన క్రేజీ ప్రాజెక్ట్‌లతో అభిమానులకు భారీ ట్రీట్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా 'జైలర్' సూపర్ హిట్ తర్వాత వస్తోన్న 'జైలర్ 2'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్‌తో రజినీకాంత్ మరోసారి జతకట్టగా, ఇప్పుడు ఈ సీక్వెల్ ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే షూటింగ్ పనులు వేగంగా సాగుతున్నాయని సమాచారం. ఇదే సమయంలో రజినీకాంత్ నటిస్తున్న 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్, సెకండ్ లుక్ పోస్టర్లు అభిమానులను ఆకట్టుకున్నాయి.ఇక 'జైలర్ 2' విడుదల తేదీపై తాజాగా ఆసక్తికరమైన సమాచారం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. 'జైలర్' చిత్రానికి సంగీతంతో ప్రాణం పోసిన అనిరుధ్ రవిచందర్ ఈ సీక్వెల్‌కూ సంగీతం అందిస్తున్నారు. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని అభిమానులు భావిస్తున్నారు. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. మొదటి భాగంలో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్ వంటి స్టార్ నటులు ప్రత్యేక పాత్రల్లో కనిపించి ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'జైలర్ 2'లో కూడా పలువురు స్టార్ హీరోలు, ప్రముఖ నటులు కీలక క్యామియో పాత్రల్లో కనిపించనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 'జైలర్'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన రజినీకాంత్-నెల్సన్ కాంబినేషన్ మరోసారి మ్యాజిక్ రిపీట్ చేస్తుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్, స్టైల్, మాస్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కుతున్న ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే అక్టోబర్ 16 విడుదల తేదీపై ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు. అయినప్పటికీ ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒకవేళ ఇదే తేదీ ఖరారైతే, దసరా సీజన్‌లో రజినీకాంత్ మరోసారి బాక్సాఫీస్‌ను శాసించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 4 నెలల్లో షూటింగ్ కంప్లీట్..

## 'వారణాసి'పై రాజమౌళి బిగ్ అప్‌డేట్!




మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'అన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనామార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.



# రాష్ట్రం విడిపోయినా మారని బుద్ధి..

## తెలంగాణ సినిమాపై ఆకతాయిల వెటకారం.. కౌంటర్ ఇస్తున్న నెటిజన్లు!




తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి మరియు వాడుక భాషా నేపథ్యాలతో వచ్చే సినిమాలపై సోషల్ మీడియా వేదికగా తరచూ వివాదాలు రాజుకుంటూనే ఉన్న సంగతి తెలిసిందే. గతంలో భారీ విజయాన్ని అందుకున్న 'బలగం' వంటి చిత్రాల విషయంలో జరిగినట్లే, తాజాగా ప్రియదర్శి మరియు నాగదుర్గ ప్రధాన పాత్రల్లో రాబోతున్న 'ఇడుపు కాయితం' అనే సినిమాపై కూడా నెట్టింట పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. తెలంగాణ వాడుక భాషలో 'ఇడుపు కాయితం' అంటే విడాకులు అని అర్థం వస్తుంది. అయితే ఈ చిత్ర టైటిల్ ప్రకటించినప్పటి నుండి సోషల్ మీడియాలో కొందరు ఆంధ్రా ప్రాంతానికి చెందిన నెటిజన్లు దీనిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. అసలు ఇది తెలుగు భాషేనా అని కొందరు ప్రశ్నించగా, మరికొందరు వ్యంగ్యంగా ఈ సినిమాకు తెలుగు డబ్బింగ్ ఉంటే చెప్పండి చూస్తామంటూ కామెంట్లు పెడుతున్నారు.అయితే రాష్ట్రం విడిపోయి ఇన్నేళ్లయినా తెలంగాణ సంస్కృతిని, భాషను ఇంకా కొందరు తక్కువ చేసి చూస్తున్నారనడానికి ఈ తరహా కామెంట్లే నిదర్శనమని తెలంగాణ నెటిజన్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ విమర్శలపై తెలంగాణ వాసులు సోషల్ మీడియా వేదికగా గట్టిగానే స్పందిస్తూ ఆకతాయిల పోస్టులకు ధీటుగా కౌంటర్లు ఇస్తున్నారు. మీలాంటి వారి సంకుచిత ఆలోచనా విధానం చూశాకే మీ నుంచి విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటం ఎంత మంచిదైందో అర్థమవుతోందని, లేదంటే ఇప్పటికీ మా తెలంగాణ అస్తిత్వాన్ని, భాషను తొక్కిపెట్టేసేవారంటూ పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు తెలుగు సినిమాల్లో తెలంగాణ యాసను కేవలం హాస్య పాత్రలకో లేదా విలన్లకో పరిమితం చేసినా, మారుతున్న కాలంతో పాటు 'ఫిదా', 'బలగం', 'దసరా' వంటి సినిమాలు తెలంగాణ సంస్కృతిని వెండితెరపై సగర్వంగా చాటి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరినీ ఆకట్టుకున్నాయని గుర్తు చేస్తున్నారు. భాషలో ప్రాంతీయ వైవిధ్యాలు ఉండటం సహజమని, ఒక ప్రాంతపు వాడుక పదాన్ని అవహేళన చేయడం సరికాదని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. వివాదాలు ఎలా ఉన్నా 'ఇడుపు కాయితం' టైటిల్ మాత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది

# 'నేను ఎవరితోనూ రిలేషన్‌లో లేను'..

## రూమర్లపై శృతి హాసన్ క్లారిటీ!

స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వ్యక్తిగత జీవితం గురించి సోషల్ మీడియాలో తరచూ పలు వార్తలు వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఆమె రిలేషన్‌షిప్ గురించి గత కొంతకాలంగా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ ప్రచారాలపై స్వయంగా శృతి హాసన్ స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన శృతి హాసన్‌కు ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ప్రశ్నలు ఎదురయ్యాయి. ఈ సందర్భంగా ఓ అభిమాని ప్రస్తుతం మీరు ఎవరితోనైనా రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? అని ప్రశ్నించగా, శృతి ఎలాంటి సందేహాలకు తావులేకుండా సమాధానం ఇచ్చారు.నేను ప్రస్తుతం ఎవరితోనూ, ఎలాంటి రిలేషన్‌షిప్‌లో లేను అని శృతి హాసన్ స్పష్టం చేశారు. దీంతో ఆమె డేటింగ్ గురించి గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడినట్లైంది.అలాగే మరో అభిమాని, నటిగా కాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారని అడగగా, చిన్నపిల్లల మానసిక వైద్యురాలిగా (చైల్డ్ సైకాలజిస్ట్) మారాలనుకునేదానిని అని శృతి తెలిపారు. ఈ సమాధానం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఒకప్పుడు తమిళం, తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న శృతి హాసన్ గత కొంతకాలంగా సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. తక్కువ ప్రాజెక్టులు చేస్తున్నప్పటికీ, తన అభిమానులతో మాత్రం సోషల్ మీడియా ద్వారా నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో శృతి హాసన్ ప్రత్యేక పాటలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇక హీరోయిన్‌గా ఆమె నటించనున్న 'సలార్ 2' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు శృతి హాసన్ స్వయంగా స్పందించి క్లారిటీ ఇవ్వడంతో సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465